

ఉత్సవాలకు సన్నద్ధం

హరిహరసుతుని ఆలయం ఉత్సవాలకు సన్నద్ధమవుతోంది. నెల రోజుల్లో మూడు ఉత్సవాలు నిర్వహించనున్నారు. - 8లో



ఏనుగుల విధ్వంసం

పలమనేరు మండలం టీఎస్ అగ్రహారంలో ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి విధ్వంసం సృష్టించింది. - 8లో



మా బడి - మంచి గుడి

జగనన్న ప్రభుత్వం నాడు– నేడు పథకం కింద సర్కారు బడుల రూపురేఖలు మార్చి కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దింది. - 8లో

న్యూస్‌రీల్

బ్రిడ్జి కోర్సు ఉచిత శిక్షణకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : బ్రిడ్జి కోర్సు ఉచిత శిక్షణకు అర్హత, ఆసక్తి ఉన్న వారు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఐటీఐ రెండు సంవత్సరాల కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు పాలిటెక్నిక్ 2వ సంవత్సరంలో చేరేందుకు అర్హత పరీక్ష కోసం ఉచిత బ్రిడ్జి కోర్సు శిక్షణ అందిస్తున్నామన్నారు. ఐటీఐలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత చెంది పాలిటెక్నిక్‌లో చేరాలనుకునే వారికి శిక్షణ ఉంటుందన్నారు. అర్హులు 2024 జనవరి 1వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. జనవరి 2 నుంచి 31 వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 7799679351, 9440738121ను సంప్రదించాలని కోరారు.

విజయవాడకు కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : విజయవాడలో ఈ నెల 22, 23 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి ఎన్నికల సమీక్షకు కలెక్టర్ షణ్మోహన్ గురువారం బయలుదేరి వెళ్లారు. రెండు రోజుల పాటు ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ శ్రీనివాసులు బాధ్యతలు నిర్వహించనున్నారు.

కోర్టు నిర్మాణాలకు అనుమతి

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో నూతనంగా న్యాయవాదుల సంఘ భవనం నిర్మించేందుకు రాష్ట్ర హైకోర్టు అనుమతులు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని, నిధులను ఇవ్వాల్సిందిగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గల్లా శివశంకర్‌నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసి కోరారు. దీనిపై మంత్రి స్పందించి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి రూ.20 లక్షలు, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప నిధుల నుంచి రూ.25 లక్షలు మంజూరు చేశారు. భవనానికి అవసరమైన స్థలాన్ని కేటాయించారు. ఆగస్టు 21న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప కలసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు ఉత్తర్వులు జారీ చేశారు.



ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులుతో కలిసి కేక్ కట్ చేస్తున్న విజయానందరెడ్డి



చిత్తూరులో జగనన్న పుట్టినరోజు వేడుకలకు హాజరైన మహిళలు

జగనన్న జన్మదినం.. ఊరంతా సంబరం

సంక్షేమ సారథి జగనన్న జన్మదినం ఊరూ వాడా సంబరంగా సాగింది. ఎక్కడ చూసినా సేవా కార్యక్రమాలతో పండుగ వాతావరణం నెలకొంది. పలు చోట్ల రక్తదానాలు, వైద్య శిబిరాలు, కుట్టుమిషన్ల పంపిణీ, బైక్ ర్యాలీలతో సీఎం పుట్టినరోజు కోలాహలంగా సాగింది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానుల్లో కొత్త జోష్ ఉరకలేసింది. ఆస్పత్రుల్లో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయడంతో రోగుల్లో సంతోషం వెల్లివిరిసింది. ఆరోగ్య ప్రదాత, రైతు బాంధవుడికి లక్షలాది మంది పేదల నుంచి ఆత్మీయ ఆశీర్వాదం అందింది.

- పేదలకు అన్నదానం, మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ
- నగరిలో మంత్రి రోజా బైక్ ర్యాలీ
- చిత్తూరులో దుస్తుల పంపిణీ



రామకుప్పం: అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

సాక్షి, చిత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. జిల్లాలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేశారు. రక్తదానం చేశారు. ఎక్కడికక్కడ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సీఎం జగన్‌పై తమకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆనందంగా ఉండాలని వాడవాడలా జనం ముక్తకంఠంతో ఆకాంక్షించారు.

- నగరిలో మంత్రి ఆర్‌కే రోజా బైక్ ర్యాలీ నిర్వహించారు. వడమాలపేట నుంచి నగరి వరకు 30 కిలోమీటర్ల మేర బైక్ ర్యాలీ నిర్వహించి కార్యకర్తల్లో కొత్త జోష్ నింపారు. పేద మహిళకుల కుట్టు యంత్రాలు పంపిణీ చేశారు. జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం 800 సిమెంట్ బస్తాలు ఉచితంగా పంపిణీ చేశారు.
- చిత్తూరులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సాంబయ్య కండ్రిగలో 150 మందికి భూ హక్కు పత్రాలు అందజేశారు.
- జీడీ నెల్లూరులోని ఆరు మండలాల్లో పుట్టినరోజు వేడుకలు ఘనంగా సాగాయి. కళత్తూరు కృపాలక్ష్మి పేదలకు అన్నదానం చేశారు.
- పలమనేరులో ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో అన్నదానం, కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.
- కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ నేతృత్వంలో నాలుగు మండలాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.
- పుంగనూరు నియోజకవర్గం అన్ని మండలాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు.
- పూతలపట్టు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, సీఎం జగన్ పేరుతో కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకం చేశారు. ఇక అన్ని మండలాల్లో అన్నదానం, రక్తదానం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు.

చిత్తూరు నుంచే తొలి విజయం

చిత్తూరు అర్బన్: ''రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 175స్థానాలకు 175 గెలుస్తామనే నమ్మకంతో ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తొలి విజయాన్ని చిత్తూరు నుంచే అందిస్తాం. ఇక్కడ పోటెత్తిన మహిళా లోకమే ఇందుకు సాక్ష్యం. ప్రతి పథకంలోనూ మహిళలను భాగస్వామ్యం చేశారు. ఇందుకు కృతజ్ఞతగా ఓటుతో జగనన్నను ఆశీర్వదించాలి.'' అని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం చిత్తూరు నగరంలో వేలాది మంది మహిళలతో సమావేశం నిర్వహించారు. చిత్తూరులో 44 వేల మంది, గుడిపాల మండలంలో 10 వేల మందికి దుస్తులు పంపిణీ చేశారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ జగనన్నకు మహిళాలోకమే అండగా ఉంటుందని ఇక్కడికి వచ్చిన వారిని చూస్తే అర్థమవుతోందన్నారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా ఉంటూ సంక్షేమ పథకాలతో జగనన్న అందరినీ ఆదుకుంటున్నారని గుర్తుచేశారు. అనంతరం విజయానందరెడ్డి భారీ కేక్ కట్‌చేసి పంచి పెట్టారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, చిత్తూరు జెడ్పీటీసీ బాబునాయుడు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రజని, సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బీరేంద్రవర్మ, కుమార్, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నగరి: బైక్ ర్యాలీలో మంత్రి ఆర్ కే రోజా



చిత్తూరులో భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు









పలమనేరు: కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, కాణిపాకం: ఆలయంలో పూజలు చేస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, పాలసముద్రం: ర్యాలీలో డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి, చౌడేపల్లె: అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

విద్యార్థులకు కృత్రిమ మేధ

- చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- జిల్లాలో 17,355 మందికి అందజేత
- ట్యాబ్‌ల పంపిణీకి రూ.57.27 కోట్లు ఖర్చు చేసిన సర్కారు


చిత్తూరు కలెక్టరేట్ : ట్యాబ్‌ల వల్ల విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాప్) అందుబాటులోకి వస్తుందని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గిరింపేట మున్సిపల్ హైస్కూల్లో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నేడు విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయని చెప్పారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ సర్కారు ఎనలేని సేవ చేస్తోందన్నారు. గత పాలకులు విద్యాభివృద్ధిని విస్మరించారని గుర్తుచేశారు. విద్యార్థులు 8వ తరగతి నుంచే క్రమంగా అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. అందుకోసం ఏటా విద్యాభివృద్ధికి వేల కోట్లు ఖర్చు చేస్తోందని వివరించారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ విద్యకు ఇంత ప్రాధాన్యత నివ్వడం లేదని చెప్పారు. నాడు నేడు పథకంతో కార్పొరేట్ బడులకు దీటుగా సర్కారు బడుల రూపురేఖలు మారాయన్నారు. డీఈఓ విజయేంద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ట్యాబ్‌లో ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లో పాఠాలు చదువుకునే వెసులుబాటు ఉందన్నారు. విద్యార్థులు విదేశీ భాషలు నేర్చుకుని అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా డ్యులింగో యాప్ రూపొందించినట్లు చెప్పారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసుకునేందుకు వీలుగా జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్‌ను ట్యాబ్‌లలో పొందుపరిచారని వెల్లడించారు.



విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పరిధిలో నిర్వహిస్తున్న బడుల్లో 8వ తరగతి చదివే ప్రతి విద్యార్థికి ట్యాబ్ అందజేస్తున్నట్లు తెలిపారు. గత విద్యాసంవత్సరంలో 8 వతరగతి చదివిన 18,130 మంది విద్యార్థులకు, 3,357 మంది టీచర్లకు మొత్తం 21,487 ట్యాబ్‌లను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలోని 31 మండలాల పరిధిలో 448 పాఠశాలల్లో చదువుతున్న 17,355 మంది విద్యార్థులకు రూ.57,27,15,000 ఖర్చుతో ప్రభుత్వం ట్యాబ్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు. డీవైఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబ్‌లను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. 8వ తరగతి తర్వాత పై తరగతులకు వెళ్లినప్పుడు కూడా ఉపయోగపడేలా 9,10 తరగతుల బైజూస్ కంటెంట్‌ను అప్‌లోడ్ చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో ట్యాబ్‌లను అందజేశారు. దీనికి హాజరైన విద్యార్థులు హ్యాపీ బర్త్‌డే జగన్ మామయ్య అంటూ సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్, సమగ్రశిక్ష శాఖ సెక్టోరల్ అధికారులు అజయ్‌కుమార్‌రెడ్డి, జయప్రకాష్, ఉదయలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం రమేష్ పాల్గొన్నారు.


ఖరీదైన ట్యాబ్ ఉచితం



నా మనవడు ధనూష్ గిరింపేట మున్సిపల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. జగనన్న సీఎం అయ్యాక సర్కారు బడులను ప్రైవేట్ బడులకంటే బాగా తీర్చిదిద్దారు. నా మనవడికి ఉచితంగా ఖరీదైన ట్యాబ్‌ను ఉచితంగా అందిస్తున్నారు. ఇంత మేలు చేస్తున్న సీఎంను నేను ఇప్పటి వరకు చూడనేలేదు. జగన్‌కు రుణపడి ఉంటాం.

– వసంత, విద్యార్థి అమ్మమ్మ

పేరు నిలబెడతాను



మా కోసం ఇంతలా మేలు చేస్తున్న జగన్ మామయ్య పేరును నిలబెడతాను. ప్రైవేట్ బడుల్లో చదివే నా మిత్రులు ట్యాబ్‌లను వాడుతున్నారు. నాకు అలాంటి ట్యాబ్ కొనివ్వమని ఇంట్లో అడిగితే అంత డబ్బులేదని చెప్పారు. ఆ ట్యాబ్‌ను జగన్ మామయ్య ఉచితంగా అందిస్తున్నారు.బాగా చదువుకుని మామయ్య పేరు నిలబెడతాను.

– కావ్య, విద్యార్థిని, చిత్తూరు

రేపు పెంచలకోనలో వైకుంఠ ఏకాదశి



పెంచలకోన క్షేత్రం

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలను నిర్వహించనున్నట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచలకోన క్షేత్రంలో శ్రీవారిని దర్శించేందుకు ఉత్తర ద్వారం ఉన్నా, వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో ఉత్తర ద్వార దర్శనం కోసం బంగారు రంగుతో కూడిన ద్వారాల ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అందులో బంగారు గరుడవాహనంపై స్వామివారిని కొలువుతీర్చనున్నట్లు తెలిపారు. ఉదయం 3 గంటలకు అభిషేకం, 5 గంటలకు పూలంగిసేవ, ఉత్తర ద్వార దర్శనం , ఉదయం 8 గంటలకు గోనుపల్లెలో గరుడసేవ, గ్రామోత్సవం, సాయంత్రం 6 గంటలకు బంగారు గరుడ వాహనంపై స్వామివారి క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

హంద్రీ-నీవాకు జలహారతి

- భైరెడ్డిపల్లె మండలంలోకి చేరిన కృష్ణా జలాలు
- రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ

భైరెడ్డిపల్లె: రైతుల సంక్షేమం, అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ అన్నారు. హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు మండల పరిధిలో చేరుకోవడంతో గురువారం ఆమె పార్టీ నాయకులతో కలిసి జలహారతి కార్యక్రమం నిర్వహించారు. నీటి ప్రవాహంలో పసుపు, కుంకుమ, చీర, పుష్పాలను వదిలిపెట్టి పూజలు చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, దీంతో తాగు, సాగునీటికి కొరత లేకుండా ఉందన్నారు. హంద్రీ–నీవా కాలువలో నీరు విడుదలతో భూగర్భ జలాల మట్టం గణనీయంగా పెరుగుతుందన్నారు. చంద్రబాబు పరిపాలనలో ఎటు చూసినా బీడు భూములు, ఎండిపోయిన పంట పొలాలు, చెరువులు, కుంటలు మాత్రమే కనిపించేవని, వైఎస్సార్ సీపీ పాలనలో పచ్చని పంటలను చూస్తున్నామన్నారు. హంద్రీ–నీవా నీటితో వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు, రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడు భైరెడ్డిపల్లె కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కానాలిండ్లు వద్ద జలహారతి ఇస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ

టీఎస్ అగ్రహారంలో ఏనుగుల విధ్వంసం

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని టీఎస్ అగ్రహారం సమీపంలో ఏనుగులు పంట పొలాలపై దాడులు చేసి, విధ్వంసం సృష్టించాయి. అడవి నుంచి బుధవారం రాత్రి వచ్చిన ఏనుగులు మొక్కజొన్న పంటలను తొక్కి నాశనం చేశాయి. గ్రామ సమీపంలోని కౌండిన్య అడవిలో ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు పంటలపై దాడి చేసినట్లు రైతులు తెలిపారు. సోలార్ ఫెన్సింగ్‌కు చార్జింగ్ పెట్టకపోవడంతోనే ఏనుగులు సులభంగా వాటిని విరగ్గొట్టి పొలాల్లోకి వచ్చినట్లు వారు తెలిపారు.



ఏనుగులు తొక్కి నాశనం చేసిన మొక్కజొన్న పంట

24న చిత్రలేఖనం పోటీలు

తిరుపతి కల్చరల్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా భారతీయ యువజనోత్సవాల్లో భాగంగా రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో ఈ నెల 24న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు జనవరి 12న వివేకానంద జయంతి ఉత్సవాల్లో బహుమతులు ఇవ్వనున్న ట్లు తెలిపారు.



సదుం: ఎర్రాతివారిపల్లెలోని కోటమలై అయ్యప్పస్వామి ఆలయం



ఉత్సవాల కోసం సిద్ధం చేస్తున్న స్వాగత తోరణాలు

హరిహరసుతుని ఉత్సవాలకు సన్నద్ధం

- నెల రోజుల్లో మూడు ఉత్సవాలు
- భారీగా తరలిరానున్న భక్తులు
- ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

సదుం: మండలంలోని సుప్రసిద్ధ ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామి ఆలయం ఉత్సవాలకు సన్నద్ధం అవుతోంది. నెల రోజుల్లో మూడు ఉత్సవాలు ఇక్కడ కనుల పండువలా నిర్వహించనున్నారు. కార్తీక మాస ప్రారంభం నుంచి, మకర సంక్రాంతి వరకు గ్రామాల్లో అయ్యప్పస్వాముల సందడి ఉంటుంది. వారి భజనలు, శరణు ఘోషతో గ్రామాలు కోలాహలంగా ఉంటాయి. అయ్యప్ప ఆలయ దర్శనం స్వాములలో భక్తిని మరింత పెంపొందిస్తుంది. ప్రతి ఏటా ఆలయంలో పడిమెట్ల పూజోత్సవం, నూతన సంవత్సరాది, మకర జ్యోతి దర్శన ఉత్సవాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు. ఈ సారి కూడా ఉత్సవాలకు ఆలయం సిద్ధం అవుతోంది.

పడిమెట్ల పూజోత్సవం

ప్రతి ఏటా డిసెంబరు చివరి వారంలో ఆలయంలో పడిమెట్ల పూజోత్సవం నిర్వహిస్తారు. ఈసారి డిసెంబరు 27న నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. అయ్యప్ప భక్తులు పద్దెనిమిది మెట్ల గుండా ఇరుముడి ధరించి స్వామి వారిని దర్శించడం పరమ పవిత్రంగా భావిస్తారు. ఆ పద్దెనిది పడిమెట్ల పూజోత్సవం రోజున సుగంధ ద్రవ్యాలతో శుభ్రం చేసి, ఫల, పుష్పాలు, వస్త్రాలు, నెయ్యి దీపాలతో అలంకరిస్తారు. ఆలయ ప్రధాన అర్చకుని ఆధ్వర్యంలో కేరళ సంప్రదాయ రీతులతో అర్ధరాత్రి వరకు పూజలు కొనసాగిస్తారు. అనంతరం స్వామి వారి దర్శన భాగ్యం కల్పిస్తారు.

నూతన సంవత్సరాది

ప్రతి ఏటా జనవరి 1న ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, పత్రాలు విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తారు. గుడి ప్రారంభం నుంచి ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. స్వామి వారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారు. భక్తులకు మంత్రితో పాటు ఆయన కుటుంబ సభ్యులు అందుబాటులో ఉంటారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతారు.

మకరజ్యోతి దర్శనం

అయ్యప్ప మాల ధరించిన భక్తులు మకర సంక్రాంతి రోజున దివ్యమంగళ జ్యోతి దర్శనానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఈ ఉత్సవాన్ని ఆలయంలో వేడుకగా నిర్వహిస్తారు. స్థానిక సదుమమ్మ ఆలయం నుంచి తిరు ఆభరణాలను మంత్రి పెద్దిరెడ్డి తలపైపెట్టుకుని కుటుంబీకులతో కలసి మేళతాళాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని, స్వామి వారికి సమర్పిస్తారు. వీటిని అలంకరించిన అనంతరం స్వామి వారి దర్శనం కల్పిస్తారు. ఏడాదికి ఒక రోజు మాత్రమే తిరు ఆభరణాల అలంకారం చేస్తారు. అనంతరం సమీప కొండల్లో జ్యోతి భక్తులకు దర్శనం ఇస్తుంది. ఈ ఉత్సవాలు తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా సకల సౌకర్యాలు సమకూరేలా ఆలయంలో వసతులు సిద్ధంగా ఉన్నాయి.



పడిమెట్లు(ఫైల్)

జనవరి 6, 7 తేదీల్లో త్యాగరాజ సంగీతోత్సవాలు

తిరుపతి కల్చరల్: తిరుపతి వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జనవరి 6, 7వ తేదీల్లో రామచంద్రపుష్కరిణి వేదికగా త్యాగరాజ స్వామివారి సంగీత మహోత్సవాలు జరుగనున్నాయి. ఈమేరకు నిర్వాహకులు గురువారం వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తితో త్యాగరాజ సంగీతోత్సవాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ శ్రీరామచంద్రుని తన కీర్తనలతో ధ్యానించిన మహా భక్తుడు సద్గురు త్యాగరాజ స్వామి అని తెలిపారు. త్యాగరాజ స్వామి సంగీత ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం, గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, వీఎస్.బాలచంద్ర, గోవింద శెట్టి, రావిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న వేదిక్ వర్సిటీ వీసీ, నిర్వాహకులు

26న 'ఆడుదాం ఆంధ్ర' ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు ఈ నెల 26వ తేదీన ప్రారంభమవుతాయని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. క్షేత్రస్థాయి అధికారులతో జేసీ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర పోటీలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఏర్పాట్లల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోటీలకు సంబంధించి అతిథులకు ఆహ్వాన పత్రికలను నేరుగా అందజేయాలని సూచించారు. జిల్లాలోని 11 మండలాల్లో 205 జగనన్న పాల వెల్లువ కేంద్రాలను ప్రారంభించినట్లు చెప్పారు. ఇంకా ప్రాథమికంగా కొన్ని చోట్ల సాంకేతికపరమైన సమస్యలు ఉన్నాయని, వాటిని వెంటనే సంబంధిత సిబ్బంది ఆ ప్రాంతాలకు వెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు.

పౌరసరఫరాల వ్యవస్థ ద్వారా సరఫరా చేసే వస్తువులను ఎండీయూ ఆపరేటర్ల ద్వారానే సరఫరా చేయించాలన్నారు. పర్యవేక్షణ బాధ్యతను డిప్యూటీ తహసీల్దార్లు తీసుకోవాలని చెప్పారు. ఎండీయూ ఆపరేటర్లు సరుకులు సరఫరా చేసే ప్రాంతాలకు వలంటీర్లు వెళ్లి నూతనంగా వచ్చిన యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించాలని ఆదేశించారు. ఆ ఇన్‌స్టలేషన్ తర్వాత ఒకటో తేదీ నుంచి సరుకుల పంపిణీలో ఎలాంటి సమస్యలుండవని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి, డీసీఓ బ్రహ్మానందరెడ్డి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ట్రాన్స్‌కో నిరక్ష్యానికి యువకుడు బలి

యాదమరి : ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యానికి యువకుడి ప్రాణాలు గాల్లో కలిసిపోయిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు, కీనాటంపల్లె దళితవాడకు సమీపంలో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు వెళ్లే 11 కేవీ విద్యుత్ స్తంభం వాలడంతో తీగలు దాదాపు 5 అడుగుల ఎత్తులో వేలాడుతున్నాయి. దీనిపై స్తానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. గ్రామానికి చెందిన యువకుడు అభి(17) బహిర్భూమికి వెళ్లినప్పుడు ఆ తీగ తగలడంతో షాక్‌కు గురయ్యాడు. దీన్ని గుర్తించిన గ్రామస్తులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే చనిపోయినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. యువకుడి కుటుంబాన్ని విద్యుత్ శాఖా అధికారులు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముగిసిన స్మార్ట్ ఇండియా హాకథాన్



చెక్ అందుకుంటున్న చండీగఢ్ యూనివర్సిటీ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు అట్టహాసంగా సాగిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలు గురువారం ముగిశాయి. విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రతి ఏటా దేశ వ్యాప్తంగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదిలో నిర్వహించిన సాఫ్టవేర్ ఎడిషన్ పోటీలకు ఎస్వీసెట్ కళాశాల వేదిక అయ్యింది. ఈ పోటీల్లో పలు కళాశాలల నుంచి 29 జట్లు 199 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారు ప్రదర్శించిన ఆవిష్కరణల్లో 5 జట్లు ఎన్నికయ్యాయి. అందులో చండీగఢ్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థుల జట్టు ఏరియల్ లొకేషన్ ఆఫ్ హాజరడస్ అట్‌మాస్ఫియర్ ఇన్ ఇండస్ట్రీస్ అనే ఆవిష్కరణ నెలకొల్పారు. ఆ ఆవిష్కరణను న్యాయనిర్ణేతలు మొదటి విజేతగా ప్రకటించారు. ఆ జట్టుకు రూ. లక్ష నగదు చెక్కును అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల వీసీ శ్రీనివాస్, ప్రిన్సిపల్ మోహన్‌బాబు, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

జనరంజకంగా నృత్య ప్రదర్శనలు



ఎన్‌టీఆర్ పురస్కారంతో కళాకారిణిని సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ఎస్ఆర్ నాట్య కళాపరిషత్ 60వ వార్షిక కళోత్సవాల్లో భాగంగా జాతీయస్థాయి నాటక, నృత్య పోటీలలో భాగంగా నాలుగో రోజు గురువారం మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన సాంఘిక, పౌరాణిక నాటికలు, నృత్యాలు జనరంజకంగా సాగుతూ సభికులను అలరింపజేశాయి. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు భగవద్గీత పోటీలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రదర్శించిన అసరసాల సాంఘిక నాటిక ఆకట్టుకుంది. అనంతరం నిడుబ్రోలు రసఝురి పొన్నూరు వారి కాపలా సాంఘిక నాటక ప్రదర్శించారు. అనంతరం శ్రీసాయి సంతోషి నాట్య మండలి సురభి వారు ప్రదర్శించిన బాలనాగమ్మ పద్యనాటకం పౌరాణిక గొప్పతనాన్ని చాటింది. అనంతరం శాస్త్రీయ నృత్య పోటీలలో చిన్నారి కళాకారులు నృత్యాభినయంతో సభికులను ఆకట్టుకున్నారు. అనంతరం ఎస్ఆర్ నాట్య కళాపరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు కళాకారులకు నగదు పారితోషికం, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. కళాకారులకు ఉత్తమ నటీ నటులుగా ఎన్‌టీఆర్ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు.

చిత్తూరులో యువకుడి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: నగరానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగుచూసింది. టూ టౌన్ ఎస్ఐ నాగరాజ కథనం మేరకు, సంతపేటకు చెందిన వెంకటేష్ (28) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇతను ప్రమాదాంలో గాయపడి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ బాధ భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆన్‌లైన్‌లో రూ.14 లక్షలకు టోపీ

చిత్తూరు అర్బన్: ఆన్‌లైన్లో వచ్చిన ఓ మెసేజ్ చూసి స్పందించిన వ్యక్తి రూ.14 లక్షలు పోగొట్టుకున్నాడు. తీరా తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చిత్తూరు టూ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. నగరంలోని సిద్ధార్థ నగర్‌కు చెందిన నరేష్ కుమార్ రెడ్డి ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇతని మొబైల్ ఫోన్‌కు ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఓ మెసేజ్ వచ్చింది. కొద్ది మొత్తం నగదు చెల్లిస్తే లక్షల్లో ఇస్తామని దాని సారాంశం. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్లో సంభాషణ జరిపి నాలుగు నెలల పాటు దాదాపు రూ.14 లక్షలు ఆన్‌లైన్ ద్వారా నగదును బదిలీ చేశాడు. తీరా ఈ నగదు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్ఐ నాగరాజ తెలిపారు.

మా బడి - మంచి గుడి

జిల్లాలోని సర్కారు బడులను గతంలోని టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. అప్పట్లో ప్రభుత్వ బడులు ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. అయితే వైఎస్ జగన్ సీఎం అయ్యాక, సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ బడులను నాడు నేడు పథకంలో అభివృద్ధి చేశారు. గతంలో కనీవినీ ఎరుగని రీతిలో కోట్లాది రూపాయలు ఖర్చు చేయడంతో సర్కారు బడుల రూపురేఖలు మారాయి. ఈ పథకం అమలుపై తల్లిదండ్రులు, టీచర్ల అభిప్రాయాలు వారి మాటల్లోనే..... చిత్తూరు కలెక్టరేట్

జనవాక్కు



నాడు-నేడు పథకంలో అభివృద్ధి చెందిన జీడీ నెల్లూరు ప్రాథమిక పాఠశాల

గతంలో ఎన్నడూ లేదు



గతంలో ఎన్నడూ సర్కారు బడులను ఇంతలా అభివృద్ధి చేయలేదు. గతంలో ఈ స్కూల్ భవనం చూసినా శిథిలావస్థలో ఉండేది. ఏ సమస్య వచ్చినా నిధులు లేక మిన్నకుండాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం అలాంటి సమస్య లేమీ లేవు. రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు పథకంలో కోట్ల రూపాయాలను బడుల అభివృద్ధికి ఖర్చు చేసింది. ఆ నిధులతో సర్కారు బడుల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి.

- అంజనేయులు శెట్టి, ఎంఈఓ, గంగాధరనెల్లూరు

నా సర్వీసులో చూడలేదు



నేను సర్వీసులో చేరినప్పటి నుంచి అనేక పాఠశాలల్లో పని చేశాను. ప్రభుత్వ బడుల అభివృద్ధికి వేల కోట్లు ఖర్చు చేసిన దాఖలాలు ఎప్పుడూ లేవు. బడుల్లో ఏ చిన్న పని చేయాలన్నా గతంలో నివేదికలు పంపించాలి. ఆ నివేదికలన్నీ బుట్ట దాఖలయ్యేవి. వేల రూపాయాల్లో మాత్రమే అభివృద్ధి పనులకు నిధులు ఇచ్చేవారు. ప్రస్తుతం లక్షల్లో, కోట్లల్లో నాడు నేడు పథకం కింద నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో అన్ని రకాల వసతులను సమకూర్చారు.

- అశోక్ బాబు, నోడల్ హెచ్ఎం, గంగాధరనెల్లూరు

కూలి చేసి చదివిస్తున్నాం



మాకు కూలి పనులు చేయడం తప్ప ఇంకే వృత్తి తెలియదు. నాకు ముగ్గురు పిల్లలు, వారందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో అన్ని వసతులను కల్పించి, చదువును చెప్పిస్తోంది. మా పిల్లలను ప్రైవేట్ బడులకు పంపిస్తే బాగుంటుందని గతంలో అనుకునేవాళ్లం. జగనన్న చేస్తున్న అభివృద్ధి చూసి, ఇక్కడే చేర్పించాం. ప్రైవేట్ బడుల్లో లేని వసతులు సర్కారు బడుల్లో ఉన్నాయి. ఇంగ్లీష్ మీడియం చదువులు చెప్పిస్తున్నారు. మాకు ఇంత కన్నా ఇంకేం కావాలి. జగనన్న చేస్తున్న మేలును ఎప్పటికీ మరిచిపోం.

- భాగ్యలక్ష్మి, విద్యార్థుల తల్లి

జగనన్నకు రుణపడి ఉంటాం



గతంలో ఏ నాయకుడూ ఇంతలా సర్కారు బడులను అభివృద్ధి చేయలేదు. నా కూతురు అక్షయ గంగాధరనెల్లూరు ప్రాథమిక పాఠశాలలో రెండవ తరగతి చదువుతోంది. మా ఊరిలో బడి కార్పొరేట్ బడి కన్నా గొప్పగా అభివృద్ధి చెందింది. మా ఊరి బడి కోసం ప్రభుత్వం లక్షల రూపాయాలను ఖర్చు చేసిందని అయ్యోర్లు చెప్పారు. ఆ బడిలో మా పాప డెస్కులపై కూర్చుని చదువుకుంటోంది. జగనన్నకు మా ఇంటిల్లిపాది రుణపడి ఉంటాం.

- రత్నకుమారి, విద్యార్థిని తల్లి